# మానవ జన్మ దుర్లభమైనది, మహోన్నతమైనది

శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc(Ag) Mobile: 9290935732

వ్యవస్థాపకులు ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరి పేట

అన్ని జన్మలలోను మానవజన్మ మాత్రమే ఉత్తమోత్తమమైనది, దుర్లభమైనది. అసలు జన్మలు 3 రకాలు. 1) దేవజన్మ 2) మానవజన్మ 3) జంతుజన్మ. అవి ఎలా వస్తాయి ? వాటి ప్రత్యేకత లేమిటి ? తెలుసుకుందాం.

మానవుడు తన జీవిత కాలంలో అనేక కర్మలను చేస్తుంటాడు. ఆ కర్మలకు ఫలితాలను అనుభవించాలి. వాటినే కర్మఫలాలు అంటారు. అనేక జన్మలలో చేసిన కర్మఫలాలు ఆ జీవుడితో పాటుగా ప్రయాణిస్తుంటాయి. అందులో అన్నీ పుణ్య కర్మల ఫలాలు మాత్రమే పక్వానికి వచ్చినప్పుడు ఆ జీవుడు దేవలోకాలలో దేవ జన్మ నెత్తుతాడు. అక్కడ ఆ కర్మఫలాల కారణంగా అనేక భోగాలను అనుభవిస్తాడు. అది భోగ భూమి. కనుక అక్కడ అతడికి ఏ కర్మలూ చేసే అధికారం లేదు. అందువల్ల పరమాత్మ నందుకోవటానికి తగిన కర్మలాచరించే అవకాశం అక్కడలేదు. తన కర్మఫలాల ననుసరించి బోగాలనుభవించి, ఆ కర్మఫలాలు క్షయం కాగానే 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి' అన్నట్లు ఈ మర్త్యలోకాన్ని - మానవలోకాన్ని చేరుకోవలసిందే. మరల మరల మానవ జన్మనో, జంతు జన్మనో ఎత్తవలసిందే. ఈ దేవ జన్మలో కేవలం మనోబుద్ధులుంటాయే గాని కర్మజేయుటకు సాధనమైన స్థూల శరీరం ఉండదు. కనుక భగవత్సాక్షాత్కారానికి ఉపయోగపడే జన్మకాదు దేవజన్మ.

ఇక అన్నీ పాపకర్మల ఫలాలు మాత్రమే పక్వానికి వచ్చినప్పుడు ఆ జీవుడు జంతువులు, పశువులు, పక్షులు, క్రిములు, కీటకాలు మొదలైన జంతువులుగా నీచయోనులందు జన్మిస్తాడు. ఆ జన్మలలో ఆ కర్మఫలాల కారణంగా అనేక బాధలు,

దుఃఖాలు అనుభవిస్తాడు, హింసించబడుతాడు. జంతు జన్మలో కర్మలు చేస్తున్నట్లు కన్పించినా, ఆ కర్మలన్నీ బుద్ధిపరంగా ఆలోచించి, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొనిచేసేవికావు. కేవలం ప్రకృతి ప్రేరణలతో పరతంత్రంగా చేస్తాయి. కారణం ఈ జన్మలలో శరీరం - మనస్సు ఉన్నాయి గాని బుద్ధి మాత్రం లేదు. కనుక ఈ జన్మలలో కూడా కేవలం కర్మఫలాలు అనుభవించుటయే గాని పరమాత్మనందుకొనుటకు తగిన జ్ఞానాన్ని పొందే అవకాశం లేదు. కనుక భగవత్సాక్షాత్కారానికి ఈ జంతు జన్మకూడా ఉపయోగపడదు.

ఇక పుణ్యపాపకర్మల ఫలలు మిశ్రమంగా పక్వానికి వచ్చినప్పుడు ఆ జీవుడు మానవ జన్మనెత్తటం జరుగుతుంది. ఈ జన్మలలో పుణ్య కర్మఫలాల కారణంగా సుఖాలు, భోగాలు, ఆనందం అనుభవిస్తాడు. పాపకర్మ ఫలాల కారణంగా దుఃఖాలు, బాధలు, అవమానాలు అనుభవిస్తాడు. అయితే ఇలా కర్మ ఫలాలనుభవించటం మాత్రమేగాక, కొత్తగా కర్మలు చేసే అధికారం కూడా ఈ మానవజన్మలోనే ఉన్నది. ఎందుకంటే స్వతంత్రంగా బుద్ధి అనే 3 సాధనాలు ఉన్న జన్మ ఇది. కనుక పరమాత్మ నందుకోవటానికి తగిన కర్మలు చేసే అధికారం, జ్ఞానాన్ని పొందే అవకాశం ఉన్న ఈ మానవ జన్మను ఉత్తమోత్తమమైనది, దుర్లభమైనది అన్నారు. 84 లక్షల జీవరాసులలో పుట్టి గిట్టిన తర్వాత లభించే అపురూప జన్మ గనుకనే ఈ మానవజన్మను “జంతూనాం నర జన్మ దుర్లభం” అని ఆచార్య శంకరులు “వివేక చూడామణి” గ్రంథంలో తెలియజేయటం జరిగింది. ఇట్టి ఈ అపురూపమైన, దుర్లభమైన, ఉత్తమోత్తమమైన మానవజన్మను పొందిన ప్రతి ఒక్కరు దీనిని సార్థకం చేసుకోవాలి.

## సార్థకం చేసుకోవటమంటే ఏమిటి ?

సాధారణంగా మానవుల అభిప్రాయం ఒకే విధంగా ఉంటుంది. బాగా చదువుకోవాలి, మంచి ఉద్యోగాలు చేయాలి, లేదా పెద్ద పెద్ద వ్యాపారాలు చేయాలి. లేదా మంత్రులుగానో, గవర్నర్లుగానో అధికార పదవులు అధిష్ఠించాలి, బాగా సంపాదించాలి, భార్యాబిడ్డలతో సహా తాను అనేక భోగాలు అనుభవించాలి. ఇంకా ఇంకా సంపాదించాలి, ఇంకా ఇంకా అనేక వస్తువులను కొని ఇంకా ఇంకా ఆనందం అవధులు లేని ఆనందం అనుభవించాలి అని. అయితే ఎవ్వరూ తాము కోరుకున్నట్లుగా జీవించలేక పోతున్నారు. ఎన్ని సుఖాలు భోగాలు అనుభవించినా ఇంకా ఏదో వెలితి, ఇంకా ఏదో కావాలనే తపన. దీనికి కారణం మనం అనుభవించే సుఖాలు తాత్కాలికమైనవే గాని నిత్యమైన సుఖాలు కాదు. పరిపూర్ణమైన సుఖాలు కాదు. ఇవి అనిత్యమైన, పరిమితమైన వస్తువుల ద్వారా వచ్చే సుఖాలు, నిత్యమైన, పరిపూర్ణమైన, శాశ్వతమైన సుఖం కావాలంటే నిత్యవస్తువు, పరిపూర్ణ వస్తువు, శాశ్వత వస్తువు ద్వారానే లభిస్తుంది. ఏమిటా నిత్యవస్తువు ? పరిపూర్ణ వస్తువు ? శాశ్వత వస్తువు ?నిత్యవస్తువు ఏకమైన పరమాత్మ మాత్రమే. ''నిత్య వస్త్వేకం బ్రహ్మ తద్వ్యతిరిక్తం సర్వం అనిత్యం'' అని 'తత్త్వబోధ' లో శంకరాచార్యులవారు స్పష్టం చేశారు. అంటే నిత్యమైన వస్తువు ఏకమైన పరమాత్మ మాత్రమే. దానికి వేరుగా ఉన్న సర్వమూ అనిత్యమైనవే, అని అర్థం. కనుక నిత్యమైన పరమాత్మతో ఐక్యత వలన లభించే సుఖం - ఆనందం అందుకొనేవరకు మానవుడికి తృప్తిలేదు. అసంతృప్తి తీరదు. అట్టి శాశ్వతానందాన్ని అందుకోవటమే జన్మను సార్థకం చేసుకోవటమంటే. ఆ శాశ్వతానందాన్నే మోక్షం, ముక్తి అన్నారు. అదే విముక్తి, దేని నుండి విముక్తి ? సర్వబంధనాల నుండి విముక్తి.

## బంధనాలంటే ఏమిటి ?

బంధనాలంటే కర్మబంధనాలే. అనంతకోటి జన్మలనుండి మనం చేస్తూవస్తున్న కర్మలే కర్మఫలాలై, మనతోపాటుగా ప్రయాణిస్తూ మనలను ఈ ప్రపంచానికి కట్టివేసి బంధాలై కూర్చున్నవి. మనం ఏవేవో కోరికలతో, ఆశలతో ఎన్నో కర్మలు చేసి, ఆ కర్మల ద్వారా ఇళ్ళూ, తోటలు, భూములు, పరిశ్రమలు, పదవులు, వస్తువులు, బ్యాంకు బ్యాలెన్సులు సంపాదిస్తాం. అయితే అలా సంపాదించినవన్నీ మనం వదిలిపెట్టి పోవాల్సిందే, కానీ వాటిని సంపాదించటానికి మనం చేసిన కర్మలు, ఆలోచనలు, సంకల్పాలు - అవి మాత్రం మనతోపాటుగా వచ్చి, కర్మఫలాలుగా, వాసనలుగా మనలను బంధించి వేస్తున్నాయి. ఆ బంధాలున్నంతకాలం మనం ఏదో ఒక శరీరంతో పుడుతూ, చస్తూ ఉండాల్సిందే. అలాగాక మళ్ళీ జన్మలేకుండా ముక్తినిపొంది శాశ్వతానందాన్ని పొందాలంటే ఈ కర్మబంధనాలన్నీ వదిలించుకోవాల్సిందే. ఐతే వీటిని ఎలా వదిలించుకోవాలి ? ఇది తెలుసుకోవాలంటే కర్మ సిద్ధాంతాన్ని మనం చక్కగా అవగాహన చేసుకోవాలి.

## కర్మ సిద్ధాంతం అంటే ఏమిటి ?

ఒక ప్రభుత్వాన్ని నడపటానికి రాజ్యాంగం ఎలాగో, ఈ సృష్టి నంతటినీ నడపటానికి కర్మ సిద్ధాంతం అనేది ఒకటి ఉన్నది.

రాజ్యాంగం మానవ నిర్మితం. అందువల్ల కొన్ని లొసుగులతో ఉంటుంది. సవరణలకు గురి అవుతూ ఉంటుంది. కొందరికి కొన్ని మినహాయింపులుంటాయి.

మరి కర్మసిద్ధాంతమో ?

కర్మసిద్ధాంతం భగవన్నిర్మితం. ఎట్టి లొసుగులు లేనిది. వీటికి సవరణలు చేయటం ఉండదు. దీనిలో ఎవరికీ ఎట్టి మినహాయింపులు ఉండవు. బంధుప్రీతి, ఆశ్రితజన పక్షపాతం , లంచాలు, రికమెండేషన్లు ఏవీ ఉండవు. దీని ముందు అందరూ సమానులే.

సాక్షాత్తు శ్రీరామచంద్రుని తండ్రియే ఐనప్పటికీ దశరథుడు పుత్రవియోగంతో మరణించాడు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడైన శ్రీకృష్ణుని తల్లిదండ్రులే ఐనా దేవకీ వసుదేవులకు కారాగార వాసం తప్పలేదు. పుత్రవియోగ దుఃఖం తప్పలేదు. ఇటువంటి స్థిరమైన శాసనం కర్మసిద్ధాంతం. ఈ కర్మసిద్ధాంతం అనేది చేసిన 'కర్మల' మీద ఆధారపడి ఉంటుంది.

## కర్మ అంటే ఏమిటి ? ఎన్ని రకాలు ?

మనం ఉదయం లేచిన దగ్గరనుండి రాత్రి పడుకొనేంతవరకు మనం చేసేపనులు అన్నీ కర్మలే. ఇలా ప్రతి మానవుడూ పుట్టిన దగ్గరనుండి చచ్చేంతవరకు కర్మలు చేస్తూనే ఉంటాడు. ఇలా కర్మలు చేస్తే ఆ కర్మలకు ఫలితం వస్తుంది. మనం చేసే ప్రతి కర్మకూడా ఎపుడో ఒకప్పుడు ఫలితాన్నిచ్చియే తీరుతుంది. అవి ఫలితాన్నిచ్చే సమయాన్ని బట్టి కర్మలను 3 రకాలుగా విభజించారు. అవి 1) ఆగామి కర్మలు 2) సంచిత కర్మలు 3) ప్రారబ్ధ కర్మలు.

1) అగామి కర్మలు :- ఇప్పుడు మనం చేస్తున్న కర్మలన్నీ ఆగామి కర్మలే. అయితే ఈ కర్మలలో కొన్ని అప్పటికప్పుడే ఫలితాన్నిచ్చి శాంతిస్తాయి. కొన్ని అప్పటికప్పుడు ఫలితాన్నివ్వకుండా తర్వాత ఎప్పుడో ఫలితాన్నివ్వటం కోసం కూడబెట్టబడి ఉంటాయి.

ఉదాహరణకు మనం భోజనం చేస్తాం. అది కర్మ. వెంటనే మనకు ఆకలి తీరుతుంది. అది కర్మఫలం. నీరు త్రాతగుతాం. అది కర్మ. దప్పిక తీరుతుంది. అది కర్మఫలం. ఎవరినైనా కోపంతో తిడతాం. అది కర్మ. అవతలివాడు బలంగలవాడైతే చెంప పగలగొడతాడు. అది కర్మఫలం. ఇలా కొన్ని కర్మలు అప్పటికప్పుడే ఫలితాన్నిచ్చి శాంతిస్తాయి.

కొన్ని కర్మలు వెంటనే ఫలితాన్నివ్వవు. ఉదాహరణకు ఎదురుగాలేని వాణ్ణి తిడతాం. వాడిమీద నిందలు వేస్తాం. కాని వాడు ఎదురుగాలేడు గనుక అప్పటికప్పుడు ఫలితంరాదు. దానధర్మాలు చేస్తాం, పుణ్యకార్యాలు చేస్తాం. అవన్నీ వెంటనే ఫలితాన్నిచ్చేవి కావు. మన పిల్లలు పరీక్షలు వ్రాస్తారు. ఫలితం 2 నెలల తర్వాత ఎప్పుడో వస్తుంది. ఇలా కొన్ని కర్మలు అప్పటి కప్పుడే ఫలితాన్నివ్వలేక, తర్వాత ఎప్పుడో ఫలితాన్నివ్వటానికి కూడబెట్టబడి (సంచితం చేయబడి) ఉంటాయి. ఇలా ఈ జన్మలో చేసే కర్మలన్నీ ఆగామి కర్మలే.

2) సంచిత కర్మలు :- ఇంతకుముందు జన్మలో చేసి - తర్వాతెప్పుడో ఫలితం ఇవ్వటానికి కూడబెట్టబడిన కర్మలలోనుండి ఆ జన్మలో ఎప్పుడో ఒకప్పుడు ఫలితాన్నిచ్చి శాంతించినవి పోను, మిగిలినకూడబెట్టబడిన కర్మలను, అదేవిధంగా అంతకుముందు అనేక జన్మలలో చేసిన కర్మలనుండి ఖర్చు అయినవిపోగా ఒక జన్మనుండి మరొక జన్మకు మోసుకుంటూ వచ్చిన కర్మలను సంచిత కర్మలంటారు. జీవుడు శరీరాన్ని విడిచిపెట్టినా ఈ సంచిత కర్మలు మాత్రం జీవుణ్ణి విడిచి పెట్టకుండా అతడితో ప్రయాణమై వస్తుంటాయి.

మనం అద్దె ఇళ్ళల్లో ఉండి ఒక ఇంటి నుండి మరొక ఇంటికి మారేటప్పుడు ఆ

యింటిలో మనం సంపాదించిన డబ్బు, వస్తువులను, అలాగే అంతకుముందు ఇళ్ళలో ఉన్నప్పుడు సంపాదించిన డబ్బు, వస్తువులలో ఖర్చైపోయినవి పోగా మిగిలిన డబ్బు, వస్తువులను కలిపి ఎలా మూటగట్టుకొని వెళతామో అలాగే జీవుడు భగవంతుడిచ్చిన అద్దెకొంపలాంటి ఈ శరీరాన్ని విడిచి వెళ్ళేటప్పుడు ఆయాశరీరాలలో ఉన్నప్పుడు సంపాదించిన కర్మఫలాలను మూటగట్టుకొని తగిన మరొక అద్దె కొంపలాంటి శరీరాన్ని వెతుక్కుంటూ వెళతాడు. ఇలా తీసుక వెళ్ళే మూటలే సంచిత కర్మలు.

3) ప్రారబ్ధ కర్మలు :- అనేక సంచిత కర్మలు జీవుడితో కలసి ప్రయాణిస్తాయని చెప్పుకొన్నాం. ఏ ప్రాణి ఐనా శరీరం విడిచిపెట్టే సమయంలో , అప్పుడు అతడి ఎక్కౌంటులో ఉన్న సంచిత కర్మలనుండి, ఏ కర్మలైతే పక్వానికి వస్తాయో, పండుతాయో, ఫలితాన్నివ్వటానికి సిద్ధంగా ఉంటాయో వాటిని ప్రారబ్ద కర్మలు అంటారు. ఆ ప్రారబ్ధ కర్మల ఫలితాన్ని అనుభవించటానికి తగిన శరీరాన్ని వెతుక్కుంటూ వెళ్ళి, తగిన శరీరంతో జీవుడు మళ్ళీ ఈ లోకంలో ప్రవేశిస్తాడు. అలా వచ్చిన జీవుడికి ఆ ప్రారబ్ధ కర్మఫలాలన్నీ అనుభవించటం పూర్తయ్యేదాకా శరీరం ఉంటుంది. ఆ కర్మ ఫలాలు అనుభవించటం పూర్తికాగానే ఆ క్షణంలోనే ఆ శరీరం వదలిపోతుంది. ఒక్కక్షణం ఉండమన్నా ఉండదు. అప్పటిదాకా దేవుడా ! నన్నెప్పుడు తీసుకెళతావయ్యా ! అని ఎంత ఏడ్చినా, మొక్కినా, ప్రార్థించినా ప్రయోజనం లేదు. ప్రారబ్ధ కర్మలు పూర్తి ఐన తర్వాత ఒక్కక్షణం ఉందామన్నా కుదరదు.

మళ్ళీ ఈ జీవితం ముగిసే నాటికి ప్రారబ్ధ కర్మలన్నీ ఖర్చయిపోగా, జన్మ జన్మలనుండి వస్తున్న సంచిత కర్మలతో ఈ జన్మలో కూడబెట్టిన సంచితకర్మలు కలుస్తాయి. ఈ మొత్తంలో నుండి మళ్ళీ ఏ కర్మలైతే పక్వానికి వస్తాయో ఆ పక్వానికి

వచ్చిన ప్రారబ్ధ కర్మలను అనుభవించటానికి తగిన శరీరాన్ని తీసుకొని మళ్ళీ జన్మ వస్తుంది ఇలా.

"పునరపి జననం పునరపి మరణం.

పునరపి జననీ జఠరేశయనం"          అని శంకరాచార్యులు

"భజగోవిందం" లో చెప్పినట్లు మళ్ళీ మళ్ళీ పుడుతూ, మళ్ళీ మళ్ళీ చస్తూ మళ్ళీ మళ్ళీ తల్లి గర్భంలో ప్రవేశించాలి. ఇలా అయితే ముక్తి ఎప్పుడు ? మోక్షం ఎప్పుడు ? శాశ్వతానందం ఎప్పుడు ? జనన మరణాలనుండి విముక్తి చెందినప్పుడే - మళ్ళీ పుట్టుక లేకుండా పోయినప్పుడే -

## మళ్ళీ పుట్టుకలేకుండా పోవాలంటే ఏం చేయాలి ?

అసలు జన్మ (పుట్టుక) ఎందుకు వస్తున్నది ? ప్రారబ్ధ కర్మ ఫలాలను అనుభవించటానికి వస్తున్నది. ఆ ప్రారబ్ధకర్మలే లేకపోతే పుట్టుకే లేదు. ఐతే ప్రారబ్ధకర్మలు ఎక్కడి నుండి వస్తున్నాయి ? సంచితకర్మలలో నుండి పక్వమై వస్తున్నాయి. కనుక ప్రారబ్ధ కర్మలు లేకుండా పోవాలంటే సంచిత కర్మలు లేకుండా పోవాలి. అయితే సంచిత కర్మలు ఎలా వస్తున్నాయి ? మనం ముందు జన్మలో చేసిన ఆగామి కర్మలలో నుండి ఫలితాన్నిచ్చినవి పోను మిగిలిన కర్మలే సంచిత కర్మలుగా వస్తున్నవి. కనుక సంచిత కర్మలు లేకుండా పోవాలంటే ఆగామి కర్మలు చేయకుండా ఉండాలి. అంటే అసలు కర్మలే చేయకుండా ఉండాలన్నమాట.

ఐతే కర్మలు చేయకుండా ఉండటం ఎవరికైనా సాధ్యమేనా ? ఈ లోకంలో వ్యవహరిస్తూ కర్మ చెయ్యకుండా ఒక్కక్షణం కూడా ఉండలేము. అందుకే 'భగవద్గీత'

లో భగవానుడు "నహికశ్చిత్ క్షణమపి జాతుతిష్ఠత్య కర్మకృత్" అని చెప్పారు. అంటే జీవించి ఉన్నంతవరకు ఒక్కక్షణం కూడా కర్మలు చేయకుండా ఉండటం సాధ్యంకాదు అని.

ఇదే భావాన్ని 'ఈశావాస్యోపనిషత్' లోని రెండవ మంత్రం స్థిరపరుస్తుంది.

"కుర్వన్నే వేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగం సమా,।

ఏవంత్వయి నాన్యథోతోస్తి నకర్మలిప్యతేనరే ॥"

ఈ లోకంలో కర్మలు చేస్తూనే నూరేళ్ళూ జీవించాలి. ఇదే నీకున్న మార్గం. మరొక మార్గంలేదు. కర్మ కళంకాన్నివ్వదు - అని ఈ మంత్ర భావం. కనుక జీవించినంతకాలం కర్మలు చేస్తూ ఉండాల్సిందే.

## ఐతే ఎలాంటి కర్మలు చేయాలి ?

జన్మలేకుండా  పోవాలంటే కర్మలు చేయకుండా ఉండాలనుకున్నాం. కాని కర్మలు చేయకుండా ఉండటం ఒక్కక్షణం కూడా సాధ్యంకాదని, జీవించి ఉన్నంత కాలం కర్మలు చేస్తూ ఉండాల్సిందేననీ తెలుసుకున్నాం. ఐతే ఎలాంటి కర్మలు చేయాలి ?

పాపకర్మలు చెడ్డకర్మలు చేశామా ? కష్టాలు, దుఃఖాలు అనుభవించటానికి నీచయోనులందు జన్మించాలి. పుణ్యకర్మలూ, మంచి కర్మలు చేశామా ? సుఖాలు, భోగాలు అనుభవించటానికి దేవయోనులందు జన్మించాలి. అవి ఇవి  కలగాపులగంగా చేశామా సుఖాన్ని దుఃఖాన్ని, భోగాన్ని , రోగాన్ని అనుభవించటానికి మానవ యోనులందు జన్మించాలి. కనుక ఎలాంటి కర్మలు చేసినా కర్మబంధం తప్పదు.

జన్మ తప్పదు.

పుణ్యకర్మలు చేస్తే బంగారు సంకెళ్ళు.

పాప కర్మలు చేస్తే ఇనుప సంకెళ్ళు.

- రెండూ సంకెళ్ళే. రెండూ జీవుణ్ణి బంధించేవే. అంటే కర్మలు చేయకుండా ఉండటానికి వీలు లేదు. చేద్దామా ? బంధాలౌతాయి. మరైతే ఎలా ?

## కర్మలు బంధాలు గాకుండా ఉండే ఉపాయం ఏమిటి ?

పాములను పట్టి ఆడించేవారు ప్రదర్శనలిచ్చి, దానిని చూసి వినోదించేవారు ఇచ్చే డబ్బుతో జీవనం గడుపుతూ ఉంటారు. ఐతే పాములు విషజంతువులు. వీటికి కోరలంటాయి. అవి కాటేస్తే ప్రాణమే పోతుంది. అలాగని వాటిని పట్టి ఆడించకపోతే జీవనం జరగదు. కుటుంబ పోషణ జరగదు. అంటే వాటిని పట్టి ఆడిస్తే ప్రాణం పోతుంది. ఆడించకపోతే జీవనం పోతుంది. మరి ఎలా ? అందుకే వాటి కోరలను పీకివేసి ఆడిస్తారు. ఇప్పుడు ప్రాణం పోదు, జీవనం జరుగుతుంది. అలాగే మనం కర్మలను చేసేటప్పుడు ఈ కర్మలన్నీ మనకు బంధం కాకుండా ఉండాలంటే కర్మఫలాలనే కోరలను పీకివేసి కర్మలు చెయ్యాలి. కనుక

1) అగామి కర్మలు చేసేటప్పుడు అప్పటికప్పుడు ఫలితాన్నిచ్చే కర్మలు చేయవచ్చు. తర్వాతెప్పుడో ఫలితాన్నిచ్చే విధంగా కర్మలు చేయకూడదు. అంటే అగామి కర్మలు సంచితం కాకుండా - కూడబెట్టబడకుండా జాగ్రత్త పడాలి. ఇక

2) ప్రారబ్ధ కర్మలను అనుభవించి ఖర్చు చేసుకోవాలి. అంతే తప్ప వీటిని వదిలించుకొనే ఉపాయం ఏమీలేదు.

3) సంచిత కర్మలు అనుభవించటానికా ? పక్వానికి రాలేదు. పోనీ జాగ్రత్త పడదామా ? ఇప్పుడు జాగ్రత్త పడి ప్రయోజనం లేదు. అవి ఎన్నో జన్మలనుండి మన చేత చేయబడి మనతో ప్రయాణిస్తూ వస్తున్నవి. వీటన్నింటిని అనుభవించి ఖర్చుచేయాలంటే ఇంకా అనంతకోటి జన్మలెత్తాలి. మరేమిటి ఉపాయం ? వీటన్నింటిని ఒక్కసారిగా దగ్ధం చేయాలి. జ్ఞానాగ్నిలో దగ్ధం చేయాలి.

ఈ ప్రకారంగా కొత్తగా కర్మఫలాలు చేరకుండా, ప్రస్తుతం అనుభవించవలసిన వాటిని అనుభవించి ఖర్చుచేసుకుంటూ నిల్వ ఉన్న వాటన్నింటినీ ఒక్కసారిగా దగ్ధం చేసి, జాగ్రత్తపడితే కర్మఫలాలంటూ ఇక ఉండవు. కనుక బంధాలుండవు. బంధాలుండవు గనుక జన్మలుండవు. జన్మలుండవు గనుక బాధలుండవు. అదే మోక్షం, శాశ్వతానందం, ముక్తి. మనం అందుకోవలసిన స్థితి అదే. అయితేపైన చెప్పిన పద్ధతుల్లో మనం సర్వకర్మ బంధనాలనుండి విముక్తం కావాలంటే గొప్ప సాధన కావాలి. అటువంటి సాధనకు మార్గం చూపేది, ఆ మార్గం వెంట మనసు చేయిపట్టుకొని నడిపించేది, లక్ష్యాన్ని చేర్చేది ఉపనిషత్తులసారం, బ్రహ్మవిద్యా ప్రబోధము, యోగశాస్త్రము అయిన 'భగవద్గీత'.

ఆగామి కర్మలను సంచితం కాకుండా ''కర్మయోగం'' ద్వారా చేయాలని తెలియచేస్తూ 1 నుండి 6 అధ్యాయముల వరకు కర్మషట్కాన్ని

ప్రారబ్ధ కర్మలను అనుభవించి ఖర్చుచేసుకోవటం 'భక్తియోగం' ద్వారా చేయాలని తెలియజేస్తూ 7 నుండి 12 అధ్యాయముల వరకు భక్తిషట్కాన్ని

సంచిత కర్మలను జ్ఞానాగ్నిలో దగ్ధం చేసుకోవటం 'జ్ఞానయోగం' ద్వారా చేయాలని తెలియజేస్తూ 13 నుండి 18 అధ్యాయముల వరకు జ్ఞానషట్కాన్ని,

భగవద్గీత ద్వారా భగవానుడు సర్వమానవలోకానికి అందించాడు. కనుక భగవద్గీతలో భగవానుడు బోధించిన ఉపాయాలను, సాధనా రహస్యాలను అవగాహన చేసుకొని కర్మబంధ విముక్తులమై మోక్ష సామ్రాజ్యాన్ని అందుకోవాలి. ఆ రహస్యాలేమిటో, ఉపాయాలేమిటో చూద్దాం.

(A) ఆగామి కర్మలు బంధం కాకుండుట ఎట్లు ?

మనం ఇప్పుడు చేసే కర్మలన్నీ ఆగామి కర్మలే. ఎటువంటి కర్మ చేసినా ఆ కర్మఫలం అనుభవించక తప్పదు. ఇది కర్మ సిద్ధాంతం. కర్మ ఫలమే మనకు బంధమై కూర్చుంటుంది. అందువల్ల కర్మలు చేస్తూ ఊడ ఆ కర్మఫలం మనకు అంటకుండా, బంధం కాకుండా తప్పించుకొనే ఉపాయాలను భగవానుడు గీతలో తెలియజేశాడు. అవి :-

1) కర్త ృత్వాభిమానం లేకుండా కర్మలు చేయుట.

2) నిష్కామంగా, ఫలసక్తి లేకుండా కర్మలు చేయుట.

3) లోక కళ్యాణం కొరకు, భగవత్ప్రీతి కొరకు కర్మలు చేయుట.

4) ఈశ్వరార్పితంగా కర్మలు చేయుట.

వివరణ :

1) కర్త ృత్వాభిమానం లేకుండా కర్మలు చేయుట :-

కర్మ ఎవరు చేస్తే ఫలం వారికే. మనం చేసే కర్మలకు కర్తలం మనమే గనుక ఆ కర్మఫలం కూడా మనకే. అయితే నేను కర్తను అనిగాక, కర్త పరమాత్మ, ఆయన యొక్క ఏజంట్‌గా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాను అనే భావంతో కర్మచేసినపుడు ఆ కర్మఫలం కర్తకే గాని మనకు రాదు. కనుక కర్త ృత్వభావంతో గాక కర్తవ్యభావంతో పనులు

చేయాలి.

ఉదాహరణకు ఒకడు కోపంతో శత్రువును హత్య చేస్తాడు. ఇది కర్త ృత్వంతో చేయటం. కనుక కర్మఫలం అతడికే వస్తుంది.

అదే ఒక తలారి నేరస్తుణ్ణి ఉరితీసి చంపుతాడు. ఇది కర్త ృత్వంతో చేసినది కాదు. కర్తవ్యతాభావంతో చేసినది. కనుక కర్మఫలం అతడికి రాదు.

ఒక జడ్జీ హంతకుడికి మరణశిక్ష వేస్తాడు. అయితే ఆ పాపం అతడికేమీ రాదు. కారణం ? చట్టాన్ని అనుసరించి కర్తవ్యాన్ని తాను నిర్వహించాడే తప్ప అందులో ఆయన కర్త కాదు.

ఇలా కర్త ృత్వభావన లేకుండా కర్తవ్యతా భావనతో పనులు చేయాలి. నేను పరమాత్మ చేతిలో సాధనాన్ని మాత్రమే. ఇలా చెయ్యటం నా కర్తవ్యం. ఇది పరమాత్మ ఆదేశం, సూత్రధారి ఆయన, పాత్రధారిని నేను అనే భావనతో చేయాలి.

అయితే ఈ భావన అన్ని సందర్భాలలోను ఉండాలి. తన స్వార్థానికి ఉపయోగించుకొనే పదం కాదు ఇది . ఒక ఉదాహరణ చూడండి.

ఒక రైతు ఒక చక్కని తోటను పెంచాడు. పుష్పాలు, ఫలాలతో అది ఎంతో అందంగా, ఆకర్షణీయంగా సువాసనలు వెదజల్లుతూంది. ఆ మార్గంలో వెడుతూ ఎవరైనా ‘‘ఎవరండీ ఈ తోటను ఇంత చక్కగా పెంచినది ?’’ అని అడిగితే ‘నేనేనండి’ అని ఆనందంతో ముందుకు వస్తాడు ఆ రైతు. ఒక రోజున ఒక ఆవు ఆ తోటలోనికి వచ్చి మొక్కలన్నింటిని నాశనం చేస్తున్నది. ఆ రైతు చూసి సహించలేక తన చేతిలో ఉన్న దుడ్డుకర్రతో దానిని బాదాడు. దానితో అది చచ్చిపోయింది. అక్కడి వారు అయ్యో ! గోహత్యా పాతకుం చుట్టుకుంటుంది నీకు అన్నారు. దాని కతను వేదాంతిలా

సమాధానమిచ్చాడు. దీనిలో నాదేముంది ? ఆ ఆవును కొట్టింది దుడ్డుకఱ్ర. ఆ కఱ్రను పట్టుకొన్నది నా చెయ్యి. కర్మేంద్రియం. దానికి అధిష్టానదేవత ఇంద్రుడు. కనుక గోహత్యా పాతకం వస్తే ఆ ఇంద్రుడికి రావాలి నాకేంరాదు అన్నాడు. తోటను పెంచినందుకు ప్రశంసలు కురిపిస్తూ ఎవరు దీనిని పెంచింది ? అని అడిగితే 'నేనే' నన్నాడు. (కర్తృత్వభావన). కాని ఆవును చంపి పాపం చేసావు కదా అంటే నాదేముంది, కర్త ఇంద్రుడు, నేను కర్తవ్యాన్ని మాత్రమే నిర్వహించాను అన్నాడు (కర్తవ్యతాభావన). ఇది స్వార్థం. మెట్ట వేదాంతం అంటారు దీన్ని. కనుక అన్ని సందర్భాలలోను అకర్తవ్యతా భావన ఉండాలి.

(2) నిష్కామంగా , ఫలాసక్తి లేకుండా కర్మలు చేయుట :-

మనం లోకంలో ఏ పనిచేసినా ఏదో ఒక ఫలితం కోరుకొనే చేస్తాం. ఏ ఫలితమూ లేకపోతే ఎందుకండి అనవసరంగా చేయటం ? అంటాము.

ఐతే ఫలితం మీద ఆసక్తితో కర్మలు చేస్తే ఫలితం మనకు బంధమౌతుంది. మనం పుణ్యకర్మలు చేస్తాం. పూజా పునస్కారాలు చేస్తాం. ధాన, ధర్మాలు చేస్తాం. ఇలా చేసేటప్పుడు మనకు పుణ్యం రావాలనే కోరిక, పుణ్యం వస్తుందనే భరోసా - నమ్మకం ఉంటుంది. దీని కారణంగా పుణ్యం వచ్చే మాట నిజమే, అయితే ఈ పుణ్యం వల్ల ప్రయోజన ఏమిటి ? దేవలోకాల్లో జన్మించి ఆ పుణ్యకర్మ ఫలంగా భోగాలను అనుభవిస్తాం. కర్మఫలం కాస్తాక్షయమై పోగానే తిరిగి ఈ లోకానికి రావాల్సిందే. పోనీ ఆ దేవలోకంనుండే సత్కర్మలు ఆచరించి పరమాత్మనందు కుందామనుకుంటే, ఆ దేవలోకం కర్మభూమి కాదు, భోగభూమి, కనుక కర్మలు చేసే అధికారం లేదు. మళ్ళీ ఇక్కడకువచ్చి పరమాత్మనందుకొనుటకు సాధన చేయువలసిందే. మరి

ప్రయోజనం ఏమిటి ? కాలం వృథా తప్ప మరేమీ ప్రయోజనం లేదు. అందుకే ఫలితం మీద ఆసక్తి లేకుండా కర్మలు చేయాలి. ఈ ఉద్దేశంతోనే భగవంతుని పూజ పూర్తయిన తర్వాత "ఏతత్ ఫలం సర్వం పరమేశ్వరార్పణమస్తు" అని పూజా విధానంలో చివరన ఉంటుంది.

కనుకనే కర్మ చేయటంలోనే నీకు అధికారం ఉంది. ఫలితంపై ఆసక్తి వద్దు. అని "గీత" లో భగవానుడు చెప్పటం జరిగింది

"కర్మణ్యేవాధి కారస్తే మాఫలేషు కదాచన ।

మాకర్మఫలహేతుర్భూ , మాతే సంగోస్త్వకర్మణి ॥"

(2వ అధ్యాయం 47 శ్లో)

కనుక కర్మ చేయటం వరకే మనవంతు. ఫలితం మీద మనకు ఆసక్తి ఉండరాదు. ఫలితం భగవదర్పితం చేయాలి. ఫలితాన్ని గూర్చి పట్టించుకోరాదు.

అయితే కొందరు దీన్ని కూడా స్వార్థానికి ఉపయోగించుకుంటారు. అది తప్పు. ఎలాగో చూడండి.

మనం బజారుకు వెళ్ళి సరుకులు కొంటాం. వాటిని రిక్షాలో పెట్టుకొని ఇంటికి వస్తాం. రిక్షావాడు డబ్బులడుగుతాడు. అప్పుడు మనం నాయనా ! భగవద్గీత ఎప్పుడూ చదవలేదా ? "కర్మణ్యే వాధి కారస్తే మాఫలేషు కదాచన" అని భగవానుడు చెప్పాడు. కనుక కర్మచేయటం వరకే నీకు అధికారం ఉంది. ఫలితం మీద నీకేమీ అధికారం లేదు అంటాం. అప్పుడు వాడు స్వామీ ! నా బోటి వాళ్ళకు అంత గొప్ప విషయాలెలా తెలుస్తాయండి. ఇప్పుడు చెప్పారు గనుక నా కర్థం అయింది. అలాగే నేను ఇక ఫలితాన్ని కోరను. కర్మనే చేస్తాను. కర్మచేసే అధికారం ఉంది గదా ! అని చెప్పి, తాను

తెచ్చిన సరుకుల సంచి పట్టుకెళ్ళి పోబోతున్నాడు. అప్పుడు బుద్ధి వస్తుంది మనకు. ఇక్కడ నిజంగా ఫలాసక్తి లేకపోవటం కాదు. ఎంతో కొంత లాభం పొందాలనే స్వార్థం మాత్రమే. ఇలాంటి పనులవల్ల బంధాలు మరింత పెరుగుతాయి.

కొందరు లోకంలో ఫలాసక్తి లేకుండా పనులు చేస్తున్నామంటారు. దొంగతనం చేస్తారు, కాని పట్టుబడి తన్నులు తినటమనే ఫలం మీద ఆసక్తి లేదంటారు.

లంచాలు తీసుకుంటారు. కాని పట్టుబడి ఉద్యోగం ఊడగొట్టుకోవటమనే ఫలం మీద ఆసక్తి లేదంటారు.

హత్యలు చేస్తారు కానీ దొరికిపోయి శిక్షపడటమనే ఫలం మీద ఆసక్తి లేదంటారు. ఇవి కాదు ఫలాసక్తిలేని కర్మలంటే. వీరికి ఫలితం మీద ఆసక్తిలేక ఫలితం వద్దనుకోవటంలేదు. చెడ& ఫలితం మీద ఆసక్తిలేక. అదే మంచి ఫలితమైతేనో - తప్పక కావాలి.

అలాగే నిష్కామ కర్మలు కూడా. సంతానాపేక్షతో పుత్రకామేష్టియాగం చేస్తారు. ఎవరినో చంపటానికి తగిన శక్తినిమ్మని తపస్సు చేస్తారు. ఎవరిచేతిలో చావులేకుండా ఉండటానికో, ఎవరి నెత్తిన చెయ్యిపెడితే వాడు భస్మమైపోవాలనో రావణ, భస్మాసురులులాగా తపస్సులు చేస్తారు. ఇవన్నీ కామ్యకర్మలు. అలాగే బాగా డబ్బు వస్తుందని లక్ష్మీపూజ, ఎన్నికల్లో గెలవాలని వెంకటేశ్వర స్వామికి తలనీలాలివ్వటం, జబ్బు తగ్గాలని ముడుపులు గట్టటం - ఇవన్నీ కామ్య కర్మలే. బంధాలకు కారణాలే.

బంధాలకు కారణం కాకుండా ఉండాలంటే నిష్కామంగా చేయాలి. సూర్యుడు వెలుగునిస్తాడు. వాయుదేవుడు ప్రాణాన్ని నిలబెట్టే గాలి నిస్తున్నాడు, చెట్లు నీడ నిస్తున్నాయి, మహాత్ములు సన్మార్గాన్ని చూపుతారు. వీరంతా ఏమికోరి ఈ కర్మలు

చేస్తున్నారు ? ఏమీ లేదు. అది వారి స్వభావం. అలాగే పూజలు, యజ్ఞయాగాదులు, దానధర్మాలు, సత్కార్యాలు చేసేటప్పుడు ఏదో ఆశించికాకుండా, కేవలం భగవంతుని స్మరణలో ఉంచుకోటానికో చేస్తున్నామని చేయాలి. అలా చేయటమే నిష్కామ కర్మ యోగం. బంధం కాకుండేది అప్పుడే.

(3) లోక కళ్యాణం కొరకు, భగవత్ప్రీతి కొరకు కర్మలు చేయుట :-

సమాజంలో పదిమంది మేలుకోసం చేసే కర్మలు నిస్వార్థంగా చేస్తే అవి సంచితం కావు. అబద్ధం ఆడటం పాపం. ఐనా ధర్మసంస్థాపన కోసం శ్రీకృష్ణుడు ధర్మరాజుచేత అబద్ధం ఆడించాడు. అట్టి కర్మలు సంచితం కావు. అలాగే లోక కళ్యాణం కొరకు చేసే యజ్ఞయాగాదులు గాని, పూజాదికాలుగాని సంచితం కావు. బంధాలు కావు.

(4) ఈశ్వరార్పితంగా కర్మలు చేయుట :-

మనం ప్రతిరోజూ ఏ కర్మలు చేస్తున్నప్పటికీ వాటిని భగవంతునికి అర్పించినట్లైతే అవి మనకు బంధం కావు. అయితే ఎలా అర్పించాలి ? మనం పులిహోర, దద్ధోజనం, చక్కెరపొంగలి లాంటి వాటిని తయారు చేసి భగవంతునికి నైవేద్యం పెడతాము. భగవంతునికి నివేదించిన తర్వాత అవి అన్నీ ప్రసాదం అవుతుంది. దానిని కళ్ళకద్దుకొని నోట్లో వేసుకుంటాం. ఇది భగవంతునికి అర్పణచేసే పద్ధతి. నిజమే, పదార్థాలనైతే అలా చేస్తాం. కాని కర్మలనెట్లా అర్పణ చేయలి ? ఎలాగంటే - మనం ఏ కర్మను తలపెట్టినా కర్మ ప్రారంభించేముందు, కర్మపూర్తయినతర్వాత, కర్మ జరుగుతూ ఉన్నప్పుడు కూడా అప్పుడప్పుడు భగవంతుని స్మరిస్తూ ఉండాలి. ఇది కర్మలను భగవంతునికర్పించే పద్ధతి. ఇక కర్మపూర్తయిన తర్వాత ఎలాంటి ఫలితం వచ్చినా సరే దానిని గురించి ఏ మాత్రం ఆలోచించకుండా, తీపిఐనా, చేదైనా, పులుపైనా, ఏ

కొంచెమైనా ప్రసాదాన్ని ఎట్లా స్వీకరిస్తున్నామో అలాగే ఆ ఫలితం భగవంతుని ప్రసాదంగా భావించి ప్రసాదబుద్ధితో స్వీకరించాలి. ఇలా గనుక కర్మలు చేసేటప్పుడు, కర్మఫలాన్ని స్వీకరించేటప్పుడు జాగ్రత్తలు తీసుకొన్నామా ? అవి ఈశ్వరార్పిత కర్మలవుతాయి. ఆ కర్మలు మనకు బంధం కాకుండా చిత్త శుద్ధిని కల్గించి ముక్తి సాధకాలవుతాయి. ఈ విషయాన్నే భగవాన్ రమణ మహర్షి ''ఉపదేశసారం'' లో ఇలా తెలియచేశారు.

''ఈశ్వరార్పితం నేచ్ఛయాకృతం । చిత్త శోధకం, ముక్తి సాధకం ॥''

పైన చెప్పిన ప్రకారం కర్త ృత్వాభిమానం లేకుండా కర్తవ్యతాభావంతోనూ, నిష్కామంగాను, ఫలాసక్తిలేకుండాను, లోకహితార్థంగాను, భగవత్ప్రీతి కరంగాను, ఈశ్వరార్పితంగాను కర్మలు చేసే విధానమే కర్మయోగం. అంటే కర్మను కర్మగాకాక, కర్మయోగంగా జేయుట ద్వారా మనం చేసే ఆగామి కర్మలు సంచితం కాకుండా, ఆ సంచితమైన కర్మలు మనతోపాటు ప్రయాణించి మనకు బంధాలు కాకుండా చేసుకోవాలి.

కనుక మనంచేసే కర్మలను ఒకటికి రెండుసార్లు బుద్ధితో యోచించి, శాస్త్రం ఎలా చేయమని చెబుతున్నదో తెలుసుకొని, మన మనోబుద్ధులు అందుకనుగుణంగా సవరించుకొని కర్మలు చేయాలి. ఎక్కుపెట్టిన బాణం వంటిది ఆగామికర్మ. ఇది చేయటం మన చేతుల్లో ఉన్నది గనుక జాగ్రత్తపడాలి. బంధాలనుండి తప్పించుకోవాలి. కనుక ఆగామి కర్మలను కర్మయోగం ద్వారా చేసి బంధాలు కాకుండా చూసుకోవాలి.

(B) ప్రారబ్ధ కర్మలు బంధం కాకుండుట ఎట్లు ?

జీవుడు శరీరాన్ని విడిచిపెట్టే సమయంలో అప్పటికి ఉన్న సంచిత కర్మలలోనుండి ఏవి పక్వానికి వస్తాయో ఆ కర్మలను ప్రారబ్ధ కర్మలు అంటారు. ఆ

ప్రారబ్ధ కర్మలను అనుభవించటానికి తగిన శరీరాన్ని ధరించి జీవుడు ఈ లోకంలోనికి వచ్చిపడతాడు. అలా వచ్చినవాడు ఆ ప్రారబ్ధ కర్మలన్నింటిని తప్పక అనుభవించవలసినదే. అలా అనుభవిస్తేనే ఆ కర్మలు ఖర్చు అయ్యేది. అనుభవిస్తేనే ప్రారబ్ధ కర్మల నుండి ముక్తి.

ఎంత గొప్పవారైనా, మేధావులైనా, పుణ్యాత్ములైనా, పరమ భక్తులైనా, మహాత్ములైనా - ఎవరైనా సరే ప్రారబ్ధ కర్మలను అనుభవించవలసిందే. ప్రారబ్ధ కర్మలు అంటే ధనస్సు నుండి విడిచిన బాణం వంటివి. విడిచిన బాణం దేనికో ఒక దానికి తగలవలసిందే. ఎవరికో ఒకరికి తగలాల్సిందే. వెనక్కు తీసుకోవటానికి వీలులేదు.

ఎన్ని చోట్ల దిరిగి ఏ పాట్లుపడినను
అంటనీయక శని వెంట దిరుగు
భూమి క్రొత్తదైన భుక్తులు గ్రొత్తవా
విశ్వదాభిరామ వినురవేమ.

మనం ఎక్కడెక్కడకు వెళ్ళినా, ఏ పాట్లు పడినా ప్రారబ్ధం మన వెంటే వస్తుంది - అని వేమనయోగి తెలియజేశాడు.

అందువల్ల ప్రారబ్ధ కర్మలఫలం ఎవరికైనా సరే అనుభవించక తప్పదు. ''ఎవరు చేసిన కర్మ వారనుభవించక ఎవరికైనా తప్ప దన్నా!'' అని మనవారు తత్వాలు పాడతారు. అందులోని అంతరార్థం ఇదే.

రామాయణంలో శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతుడై అరణ్యవాసానికి వెళ్ళిన తర్వాత, అయోధ్యకు వచ్చిన భరతుడు జరిగిన విషయం తెలుసుకొని ఎంతో దుఃఖించాడు. తల్లిని నిందించాడు. దుఃఖోపశమనం కొరకు వశిష్ఠుని వద్దకు వెళ్ళి తన

దుఃఖాన్ని వెలిబుచ్చాడు. వశిష్ఠుడు భరతుని ఓదారుస్తూ ''సంతోషంగాని, దుఃఖంగాని, పుట్టుకగాని, చావుగాని, కీర్తిగాని, అపకీర్తిగాని - ఇవన్నీ ప్రారబ్ధవశమైయుంటాయి. అవి ఎలా నిశ్చయింపబడి ఉన్నాయో అలా జరగాల్సిందే'' అన్నాడు.

నిజంగా మనం రామాయణ గ్రంధాన్ని గనుక ఈ దృష్ఠితో పరిశీలించి చూస్తే (i) సంతోషం ఎవరికో దుఃఖం ఎవరికో చూడండి.

అరణ్యాలలో అనాగరికంగా జీవించే ఒకవృద్ధురాలు శబరి. ఆమెకు శ్రీరాముని దర్శించాలనే ఒక్కటే ఒక్క కోరిక. అది సాధ్యమో, అసాధ్యమో ఆలోచించలేదు. ఎలాగైనా దర్శించగలననే నమ్మకంతో జీవిస్తున్నది. జీవితమంతా రాముని కోసం ఎదురు చూస్తూనేఉన్నది. తన కోరిక తీరే క్షణం రానే వచ్చింది. వెతుక్కుంటూ వచ్చాడు శ్రీరాముడు. ఆమె ఆనందానికి హద్దులేదు.

శ్రీరాముని తల్లి కౌసల్య. బిడ్డలు లేక దుఃఖించినంతకాలం దుఃఖించింది. కొద్దికాలం శ్రీరాముణ్ణి చూచుకొని ఆనందించింది. కాని అంతలోనే వియోగం. ఆ వియోగ దుఃఖాన్ని అనుభవించింది. అదే సమయంలో పుత్రవియోగంతో పాటు భర్తమరణం కూడా. కనుక శ్రీరామునకు ఏమీకాని శబరి జీవితాశయం నెరవేర్చుకొని ఆనందం పొందితే, శ్రీరాముని కన్నతల్లి కౌసల్ల పుత్రవియోగ, పతి వియోగ దుఖం అనుభవించింది.

(ii) అలాగే పుట్టుక ఎవరికో మరణం ఎవరికో చూడండి.

గౌతమ మహర్షి భార్య అహల్య. పాషాణం కమ్మని శపించాడు గౌతముడు. యాగ రక్షణకు విశ్వామిత్రుని వెంటవెళ్ళే శ్రీరాముని పాదస్పర్శతో అహల్యకు జన్మవచ్చింది. కానీ శ్రీరాముని తండ్రియైన దశరధుడు మాత్రం ఆ శ్రీరాముడు

అరణ్యాలకు వెళుతుంటే పుత్రవియోగ దుఃఖంతో రామా ! రామా! అని ఆక్రోశిస్తూ మరణించాడు. అంటే కన్నతండ్రికి చావు, ఎక్కడో బండరాయిలా పడి ఉన్న తనకేమీ కాని అహల్యకు జన్మ.

(iii) అలాగే కీర్తి ఎవరికో అపకీర్తి ఎవరికో చూడండి.

శ్రీరాముని భార్యను అపహరించినవాడు రావణుడు. అతడిని చంపవలసిన కర్తవ్యం శ్రీరామునిది. రామునికి సహాయ పడవలసిన వారు సోదరులు, అయోధ్య సైనికులు, వీరులు. కానీ భరత శత్రుఘ్నులకు కాని, అయోధ్య సైనికులకు, వీరయోధులకు గాని రామరావణ యుద్ధం సంగతే తెలియదు. అయితే ఈ యుద్ధంలో శ్రీరామునికి సహాయం చేసి బ్రహ్మాండమైన కీర్తిని మూటగట్టుకున్న వారు ఆంజనేయుడు, సుగ్రీవుడు, విభీషణుడు, జాంబవంతుడు మొదలైన కోతులు, భల్లూకాలు, రాక్షసులు, కనుక కీర్తి వీరికి. మరి అపకీర్తి ఎవరికి ?

చిన్న తనం నుండి శ్రీరాముణ్ణి కన్నతల్లి కన్న ఎక్కువగా ఆదరించి, వాత్సల్యంతో చూచిన కైకకు. శ్రీరాముని పట్టాభిషేక వార్త విని ఎంతో ఆనందించిన కైక ఆ పట్టాభిషేకాన్ని ఆపి, శ్రీరాముని వనవాసానికి పంపి భర్తచేత, పుత్రునిచేత, సవతులచేత, ప్రజలచేత ఛీత్కారాలు పొందింది. మోయలేనంత అపకీర్తిని నెత్తికెత్తుకుంది.

ఇవన్నీ ప్రారబ్ధకర్మల ఫలితమే. ఎంతటి వారికైనా అనుభవించక తప్పదు. కనుక మనం కూడా ప్రారబ్ధ కర్మల ఫలితం నుండి తప్పించుకోలేము. మనకు కలిగే కష్టాలు, నష్టాలు, సుఖాలు, దుఃఖాలు అన్నీ ప్రారబ్ధవశంగా కలిగేవే.

అయితే ఈ కష్ట నష్టాలు, బాధలు, దుఃఖాలు కలిగినపుడు అందరం ఎంతో బాధపడతాం, దుఃఖిస్తాం. కాని మనం ఈ కర్మలను అనుభవించటానికి సిద్ధంగా

ఉండాలి. అనుభవించేటప్పుడు ఋణం తీరిపోతున్నదని సంతోషించాలి. చేసిన కర్మలు కాస్తాఖర్చై పోతున్నాయని సంతోషించాలి. మనం ఒకరి దగ్గర అప్పుతీసుకున్నాం. తీసుకొన్న అప్పు ఎప్పుడో ఒకప్పుడు తీర్చాలి. అలా తీర్చేటప్పుడు మన చేతిలో సొమ్ము పోతున్నదే అని ఏడవాలా ? అప్పు తీరిపోతున్నదే అని సంతోషించాలా? ఆలోచించండి. ఇలా అనుభవించి ఖర్చు చేసుకున్నందువల్ల సంచిత కర్మల మూటలలో నుండి కొంత బరువు తగ్గిపోతున్నదని అర్థం చేసుకోవాలి.

అయితే చెప్పటానికి బాగానే ఉందిగాని కష్టాలు అనుభవించేటప్పుడు సంతోషం ఎలా కలుగుతుంది సంతోషం లేక పోయినా ఆ బాధలను భరించటం ఎట్లా ? అని మనకు సందేహం వస్తుంది. దానికే చక్కని మార్గం చూపారు భగవద్గీతలో. పరమాత్మపై భక్తితో, నామస్మరణ చేస్తూ, భగవచ్చింతన చేస్తూ, ఆయనపై భారం వేసి ప్రారబ్ధకర్మఫలాలను అనుభవించాలి. కష్టాలు, దుఃఖాలు కలకాలం ఉండవని, దుః ఖాలు పోయిన తర్వాత సుఖాలు వస్తాయని, కష్టాలలోనే భగవంతుడు బాగా గుర్తు వస్తాడని భావిస్తూ కష్టాలను దుఃఖాలను అనుభవించాలి. ఇదే భక్తి యోగం.

బజారుకు వెళ్ళి వస్తున్న బిడ్డకు సైకిల్ గుద్దుకొని దెబ్బతగిలింది. ఆ బాధకు తట్టుకోలేక కేకలు వేస్తున్నాడు. వెంటనే తల్లి దండ్రులు డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళి కట్టు కట్టిస్తారు. ఇంజెక్షన్ చేయిస్తారు. మాత్రలు వ్రాస్తే తెస్తారు. మెత్తటి పరుపుమీద పండబెట్టి సేవచేస్తారు. టైం ప్రకారం మాత్రలు మ్రింగిస్తారు. విసన కర్రతో విసురుతారు. కాళ్ళు, చేతులు ఎక్కడ నొప్పి అంటే అక్కడ ఒత్తుతారు. కానీ ‘‘నాన్నా! ఈ నొప్పి నేను భరించలేను నీవు తీసుకో’’ అంటే మాత్రం అది కుదరదు. అలాగే ప్రారబ్ధ కర్మ ఫలాలు అనుభవించటం మాత్రం మనమే అనుభవించాలి. అయితే తల్లి వంటి, తండ్రివంటి

పరమాత్మను ఆశ్రయిస్తే ఆ బాధను భరించగలుగుతాం. కనుక ప్రారబ్ధ కర్మ ఫలాలను భగవత్ స్మరణతో భక్తి యోగం ద్వారా అనుభవించి ఖర్చుచేసుకోవాలి.

(C) సంచిత కర్మలు బంధం కాకుండుట ఎట్లు ?

ఆగామి కర్మలు చేయటంలో మనకు స్వతంత్రం ఉంది. కనుక కర్మయోగం అనే ఉపాయంతో చేస్తాం. ప్రారబ్ధకర్మలు అనుభవించి ఖర్చుచేసుకోవాల్సిందే. కనుక భక్తియోగం అనే ఉపాయంతో అనుభవిస్తాం. మరి సంచిత కర్మలో ? జాగ్రత్త పడటానికా - అవి ఇప్పుడు చేయబోయే కర్మలు కాదు. ఎప్పుడో ఇంతకు ముందు అనేక జన్మలలో చేసినవి. పోనీ అనుభవించి ఖర్చుచేసుకుందామా - అని ఇంకా పక్వానికి రాలేదు. ముందు ఎప్పుడో అనుభవించటానికి కూడబెట్టబడి మనతో వస్తున్నాయి. వాటిని ఖర్చుచేసుకోవాలంటే ఇంకా అనంతకోటి జన్మలెత్తి ఖర్చు చేసుకోవాల్సిందేగాని ఈ జన్మలో అనుభవించేవి కాదు. కనుక కర్మబంధం నుండి తప్పించుకొని - మళ్ళీ జన్మంటూ లేకుండా ముక్తి పొందాలంటే, మోక్షం పొందాలంటే, శాశ్వతానందాన్ని పొందాలంటే ఈ సంచిత కర్మలన్నిటిని ఒక్కసారిగా దగ్ధం చేయాలి ? ఎక్కడ ? జ్ఞానాగ్నిలో, ''జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణాం'' అని గీత చెబుతుంది. కనుక జ్ఞానమనే అగ్నిలో సర్వకర్మలనూ దగ్ధం చేయట మొక్కటే మార్గం. ఇదే అత్యంత కష్టమైనది. సర్కస్‌లో తీగమీద నడకలాంటిది. ఈ మార్గాన్నే ఉపాయాన్నే జ్ఞానయోగం అన్నారు.

జ్ఞానం అంటే ఏమిటి ? స్వస్వరూప జ్ఞానమే జ్ఞానం.

మన యొక్క అసలు రూపం సచ్చిదానంద స్వరూపం. అయితే విడిచి పెట్టే ఈ దేహాన్ని చూచుకొని ఇదే నా స్వరూపం అనుకుంటున్నాం. ఈ లోకంలో వ్యవహరించటానికి మనం ఉపయోగించుకుంటున్న మనోబుద్ధులనే పరికరాలను

చూచుకొని ఇదే నా స్వరూపం అనుకుంటున్నాం. ఈ దేహ, మనో, బుద్ధులు నేను వాడుకొనే పరికరాలేగాని నేనుగాదు. ఆ 'నేను' ఎవరో తెలుసుకొనే ప్రయత్నం చేయక, ఈ దేహ మనోబుద్ధులతో తాదాత్మ్యం చెంది నేను అనుకోవటం అజ్ఞానం. అజ్ఞానం వల్ల బాధలు, దుఃఖాలు, భయాలు.. అన్నీ. ఈ అజ్ఞానాన్ని తొలగించుకొని, ఈ తాదాత్మ్యాన్ని విడిచిపెట్టి, మన అసలు స్వరూపం సచ్చిదానంద స్వరూపం అని అనుభవపూర్వకంగా గ్రహించటమే జ్ఞానం. ఆ జ్ఞానాన్ని పొందితే జ్ఞానాగ్ని పుడుతుంది. అయితే ఈ స్వస్వరూప జ్ఞానం పొందాలంటే గురువు సహాయం కావాలి.

ఒక అరణ్యంలో సింహం ఒకటి ఉండేది. అది పిల్లను కని చనిపోయింది. ఆ సింహం పిల్ల అమాయకంగా అక్కడ పడి ఉంది. ఆ మార్గంలో ఒక గొర్రెల కాపరి తన గొర్రెలను తోలుకొని ఇంటికి వెళుతూ ఈ సింహం పిల్లను చూశాడు. జాలిపడి దాన్ని తనతోపాటు తీసుకెళ్ళాడు. తన గొఱ్ఱెలతో పాటు దాన్ని పెంచాడు. ఆ సింహంపిల్ల గొర్రెల ఆహారం తీసుకుంటూ, వాటితో కలసిమెలసి ఉంటూన్నది. అలా అరణ్యంలో తిరుగుతుండగా ఒకనాడు ఒక సింహం ఆ ప్రాంతంలో గొఱ్ఱెల మందను చూసింది. తనకు కావలసినంత ఆహారం దొరికింది గదా అని సంతోషంతో ఆ మందపై బడ్డది. ఆ సింహాన్ని చూచిన గొర్రెల మంద పరుగు లంకించు కున్నది. వాటితో పాటు ఈ సింహం పిల్ల కూడా భయంతో పరుగు లంకించుకున్నది. ఆ సింహం భయంతో పరిగెత్తే ఈ సింహంపిల్లను జూచి ఆశ్చర్యపోయింది. నా జాతివాడు కూడా నన్ను చూచి పరుగెత్తు తున్నాడే అనుకొని వెంటపడి ఎలాగైతేనేం ఆ సింహం పిల్లను పట్టుకుంది. ఆ సింహం పిల్ల భయంతో వణికిపోతూ 'నన్ను చంపకు' 'నన్ను చంపకు' అని దీనంగా వేడుకుంటున్నది. నీ వెందుకిలా భయపడి పరుగు తీస్తున్నావు ? ఆ

గొర్రెలు అల్పజీవులు గనుక మనలనుజూచి భయపడతాయి. నీవు సింహానివి. నీవెందుకు భయపడతావు ? అని అడిగింది సింహం. నేను గొర్రెను , నేను గొర్రెను, నేను సింహాన్ని కాదు, నన్ను వదలి పెట్టు అని బ్రతిమాలు కొంది. వణికిపోతున్నది ఆ సింహం పిల్ల.

అప్పుడు సింహం ఆ పిల్లను ఒక చెరువు దగ్గరకు తీసుకవెళ్ళి ఆ చెరువులోని నీటిలోనికి వంగి ఇప్పుడు నన్ను చూడు నీటిలో అన్నది. చూచింది పిల్ల. నిన్ను నీవు చూసుకో అంది. చూసుకుంది. నేను సింహాన్నే గదా! అంది సింహం. అవును అన్నది పిల్ల. మరి నీవో ? అంది సింహం. నేను కూడా సింహాన్నేనేమో ? అలాగే ఉన్నట్టుంది అని అనుమానంగా అంగీకరించింది.

సరే ఇదిగో నేను పెద్దగా కేక వేస్తున్నాను అని గర్జించింది. నీవు కూడా అలాగే కేక వేయమన్నది. సింహం పిల్లకూడా అలాగే గర్జించింది. దానితో తనకు తానెవరో తెలిసిపోయింది. ఓహో ! నేను కూడా సింహాన్నే ! గొర్రెనుకాదు అని నిశ్చయించుకొని తోక ఊపుకుంటూ ఆనందంతో అరణ్యంలోకి వెళ్ళింది. ఇప్పుడు దానికేమీ భయంలేదు - బాధలేదు.

ఇంతవరకు తన నిజస్వరూపాన్ని మరచిపోయి తాను గొర్రెను అనుకోవటంతో భయం, దుఃఖం కలిగింది. ఎప్పుడైతే తన నిజస్వరూపాన్ని - స్వస్వరూపాన్ని తెలుసుకుందో భయం బాధ మాయమయ్యాయి. ధైర్యంతో ఆనందంతో తోక ఆడించుకుంటూ అరణ్యంలోకి వెళ్లింది.

అలాగే మనంకూడా మన స్వస్వరూపాన్ని మర్చిపోయాం. శరీరమే నేనని, మనోబుద్ధులే నేనని, అజ్ఞానవశంచేత అనుకున్నాం. మన అసలు రూపం పరమాత్మ

అయితే జీవుడు అనుకుంటున్నాం. అందుకే అనేక కష్టాలు, నష్టాలు, బాధలు, భయాలు. ఇవన్నీ తొలగాలంటే అక్కడ సింహంలాగా ఇక్కడ మనకూ ఒక గురువు కావలి. మనలోని అజ్ఞానాన్ని రూపు మాపి, మన స్వరూపాన్ని మనం గ్రహించేటట్లు సహాయ పడాలి. అప్పుడే సర్వభయాలనుండి, బంధాలనుండి, సంచిత కర్మలనుండి విముక్తి. అదే ముక్తి. అదే మోక్షం. ఇలా స్వస్వరూపాన్ని పొందటమే జ్ఞానం. ఆ జ్ఞానంవల్ల జ్ఞానాగ్ని పుడుతుంది. ఆ జ్ఞానాగ్నిలో సర్వకర్మలూ దహించుక పోతాయి.

అనంతకోటి జన్మలలో మనచేత చేయబడి, మనతోపాటుగా ప్రయాణిస్తున్న సంచిత కర్మలన్నీ, నిశ్శేషంగా, నిజంగా ఈ జ్ఞానాగ్నిలో - అంటే స్వస్వరూపం తెలుసుకొన్నంత మాత్రాన దగ్ధమై పోతాయా ? సందేహం లేదు. తప్పకుండా దగ్ధమై పోతాయి. ఎలాగో చూడండి.

ఒక ధనవంతుడున్నాడు. అందమైన భార్య, రత్నాలవంటి బిడ్డలు. కావలసినంత సంపద, కోరుకున్న భోగాలు - అంతా ఆనందమే. దుఃఖం లేదు. ఒక రోజు రాత్రి మెత్తటి పరుపు మీద ఎయిర్ కండీషన్ రూంలో పడుకున్నాడు. కొంతసేపటికి నిద్ర వచ్చింది. ఆ నిద్రలో కల వచ్చింది. ఆ కలలో తానొక పేదవాడు. పెద్ద కుటుంబం. కుటుంబ పోషణకు కూలి పని చేసుకుంటున్నాడు. ఒక రోజున తోటి కూలీలతో ఘర్షణ వచ్చింది. తనకు, తనతోటి కూలీకి మధ్య మాటా మాటా పెరిగింది. చేతులు కలిసినవి. దగ్గరలో ఉన్న గడ్డ పలుగులు చెరొకటి తీసుకున్నారు. ఆ పోరాటంలో తోటి కూలీని పొడవటంతో అతడు అక్కడి కక్కడే చనిపోయాడు. దానితో పోలీసులు రంగప్రవేశం చేశారు. హంతకుణ్ణి పట్టుకున్నారు. కోర్టులో ఐ.పి.సి. 302 సెక్షన్ క్రింద కేసు ఫైల్ చేశారు. కోర్టులో ఒక సంవత్సరంపాటు కేసు నడిచింది. వాదోప వాదాలు

పూర్తయిన తర్వాత జడ్జి తీర్పు చెప్పాడు. 12 సంవత్సరాల కఠిన కారాగార వాస శిక్ష విధించాడు. అతణ్ణి జైలుకు తరలించారు. కఠిన నిబంధనలతో ఆ జైలు జీవితాన్ని గడుపుతున్నాడు. 3 సంవత్సరాలు గడిచిపోయింది. అక్కడి తిండి తినలేక, వారు చేయించే కఠినమైన పనులు చేయలేక బాధపడుతున్నాడు. గోరు చుట్టు మీద రోకటి పోటులా ఒక కఠిన హృదయంగల ఆఫీసరు జైలరుగా వచ్చాడు. ఖైదీలచేత రాళ్ళు కొట్టిస్తున్నాడు అతడు. మనవాడు రాళ్ళుకొట్టి, కొట్టి నీరసించిపోయాడు. చేతులు బొబ్బలెక్కినవి. అవి మంటలు పెడుతున్నాయి. ఒక్కక్షణం పని ఆపాడు. వెంటనే ఆ కఠినుడైన జైలరు కొరడాను ఛెళ్ళు మనిపించాడు మనవాడి వీపుమీద, ఆ దెబ్బకు ఓర్చుకోలేక పెద్దగా ఏడ్చాడు. దెబ్బమీద దెబ్బ వేస్తున్నాడు. వీపు చిట్లి రక్తం కారుతున్నది. భరించలేని వేదనతో ఆర్తనాదాలు చేస్తున్నాడు. ఆ కేకల్లో ఒక కేక పైకే వేశాడు. ఉలిక్కిపడిన భార్య "ఏమిటండీ! పీడకలేమైనా వచ్చిందా" అని పరామర్శించింది. కలా ! ఆ అంటూ ఒక్క క్షణం ఆశ్చర్యపోయి ఆ ! ఆ! కలే అన్నాడు.

ఇంతవరకూ ఆయనపడ్డ బాధల్లో ఒక్కటైనా ఇప్పుడుందా ?లేదు. 12 సంవత్సరాల శిక్షలో మూడేళ్ళు అనుభవించాడు గదా ! మిగతా 9 ఏళ్ళు ఇప్పుడు అనుభవిస్తాడా ? ఊహూ ఁ అదేంలేదు. ఆ మిగిలిన శిక్షపూర్తిగా రద్దు అయిపోయింది.

అంటే స్వప్నంలో చేసిన కర్మఫలాలన్నీ మేలుకోగానే రద్దైపోయాయి. అదేవిధంగా ఈ మేలుకున్న అవస్థ - అంటే జాగ్రదావస్థలో చేసిన కర్మఫలాలన్నీ జ్ఞానావస్థలో రద్దైపోతాయి.

జాగ్రదావస్థ అజ్ఞానావస్థ. జ్ఞానావస్థ అంటే తన స్వస్వరూప అనుభవంలో నిలిచిన అవస్థ.

ఆ ధనికుడు తన యొక్క నిజస్వరూపాన్ని - అంటే స్వస్వరూపాన్ని - అంటే ధనికుడను అనే విషయాన్ని మరిచిపోయాడు. ఆ మరచిపోయిన అవస్థలో చేసిన కర్మలు - కర్మఫలాలు అన్నీ కూడా తన స్వస్వరూపం గుర్తుకురాగానే రద్దై పోయినవి.

స్వప్నావస్థలో ఉన్నంత కాలం స్వప్నంలో జరుగుతున్నవన్నీ నిజం. జాగ్రదావస్థలోనికి రాగానే అవి అన్నీ అబద్ధం. అలాగే జాగ్రదావస్థలో ఉన్నంత కాలం జాగ్రత్తులో జరిగేవన్నీ నిజం. జ్ఞానావస్థలోనికి (స్వస్వరూప స్థితికి) రాగానే అవి అన్నీ అబద్ధం. కనుక స్వస్వరూప జ్ఞానం పొందితే ఆ జ్ఞానాగ్నిలో సర్వకర్మలు దగ్ధమౌతాయి. ఈ విధంగా సర్వ సంచిత కర్మలు నశించిపోయాతి.

ఆగామి కర్మలను 'కర్మయోగం' ద్వారా చేసి, సంచితం కాకుండా జాగ్రత్త పడుతున్నాం. ఇప్పటికే ఉన్న సంచిత కర్మలలో పక్వానికి వచ్చిన ప్రారబ్ధ కర్మలను 'భక్తి యోగం' ద్వారా అనుభవించి ఖర్చు చేసుకుంటున్నాం. మిగిలిన జన్మ జన్మాంతముల నుండి మనతో ప్రయాణం చేస్తూ వస్తున్న అన్ని సంచిత కర్మలను 'జ్ఞానయోగం' ద్వారా జ్ఞానాగ్నిలో దగ్ధం చేస్తున్నాం.

ఇప్పుడు సంచిత కర్మలంటూ లేవు జీవుడితో ప్రయాణించటానికి. సంచిత కర్మలు లేవు గనుక వాటిలో కొన్ని పక్వానికి వచ్చి ప్రారబ్ధ కర్మలుగా మారటం జరగదు. ప్రారబ్ధకర్మలు లేకపోతే జన్మలేదు. జన్మ లేక పోతే జన్మ దుఃఖం, జరా దుఃఖం, వ్యాధి దుఃఖం, మరణ దుఃఖం అంటూ దుఃఖాలే ఉండవు. అట్టి దుఃఖారాహిత్యమే మోక్షం. అదే శాశ్వతానంద ప్రాప్తి - ముక్తి - మోక్షం. ఆ మోక్షాన్ని అందుకోవటానికే మానవ జన్మతో మనం ఇక్కడకు వచ్చింది. ఐతే మనం ఎందుకు ఈ లోకంలోకి వచ్చి పడ్డామో మరచి పోయాం.

తల్లి గర్భంలో ఉండగా, పూర్వ జన్మల స్మృతి ఉన్న ఈ జీవుడు ''ఓ భగవంతుడా ! ఎంత తప్పు చేశాను? నా కింతవరకు తరించటానికై అనేక మానవ జన్మలు ఇచ్చావు. ప్రతి జన్మను నేను నిరర్ధకం జేసుకున్నాను. సార్థకం చేసుకోలేదు. ఎప్పటికప్పుడు ''ఈసారి జన్మనైనా సార్థకం చేసుకోవాలి, పరమాత్మ నందుకోవటానికే ఈ జన్మను వినియోగించుకోవాలి'' అని తల్లి గర్భంలో ఉన్నప్పుడు నిర్ణయం తీసుకుంటూ ఉండేవాణ్ణి. కాని తల్లి గర్భంలోని నరకయాతనలన్నీ అనుభవించి బయటపడటంతోనే బలమైన మాయ నన్ను కప్పి వేస్తున్నది. మళ్ళీ ఈ ప్రాపంచిక వ్యామోహాలలో చిక్కుకొని అనేక నిషిద్ధ కార్యాలు చేస్తున్నాను. స్వార్థం కోసం పనిచేస్తున్నాను.

నేను ధరించే శరీరానికి సంబంధించినవారే తప్ప ! నిజంగా నాకేమీగాని, నాతోరాని తల్లి దండ్రులు, భార్యాబిడ్డలు, బంధుమిత్రులు మొదలగు వారి కోసం అనేక అక్రమాలు చేశాను. ఇక్కడే - ఈ లోకంలోనే విడిచిపెట్టిపోయే ధన సంపదల కోసం, ఇళ్ళు వాకిళ్ళ కోసం, పదవుల కోసం, భార్యా బిడ్డల కోసం జీవితమంతా ధారపోశానే కాని, నా జన్మ తరింపజేసుకోటానికి, శాశ్వతానందప్రదమైన మోక్షస్థానాన్ని అందుకోవటానికి కృషిచేయని అభాగ్యుడనయ్యాను. దానికి ఫలితంగా కుక్కగా, నక్కగా, పందిగా, క్రిమిగా, కీటకంగా, తేలుగా, పాముగా అనేక నీచ నికృష్ణ జన్మలెత్తాను. భరించలేని దుఃఖాన్ని అనుభవించాను. ఇక ఈసారైనా ఇలాంటి తప్పు చేయకూడదు. ఈ గర్భనరకం తప్పి భూమి మీద పడగానే ఎంతటి త్యాగమైనా చేసి, ప్రాపంచిక వ్యామోహాలలో చిక్కుకోకుండా సద్గురువును ఆశ్రయించి నా జన్మను తరింపజేసుకుంటాను. ఓ భగవంతుడా! అందుకు నాకు సహాయం చెయ్యి. నీ మేలు మరచిపోను'' అంటూ దీనంగా వేడుకుంటాడు - అని 'గర్భోపనిషత్తు' తెలియజేస్తున్నది.

కనుక మనం మానవ జన్మ ఎత్తి ఈ లోకానికి వచ్చింది మోక్షమునందుకోవటానికే - భగవత్సాక్షారానికేనని గుర్తుంచుకోవాలి. అలా మోక్షాన్ని అందుకోవాలంటే.

కర్మయోగం ద్వారా ఆగామి కర్మలను చేయాలి.

భక్తి యోగం ద్వారా ప్రారబ్ధ కర్మలను అనుభవించాలి.

జ్ఞానయోగం ద్వారా సంచిత కర్మలను నాశనం చేసుకోవాలి.

అలా సర్వ కర్మ బంధనాలనుండి విముక్తుడైతే ఇక జన్మలేదు. జన్మలేకపోతే మరణం లేదు. ఇలా జనన మరణ సంసార చక్రబంధంనుండి విముక్తి గలుగుటే మోక్షం - శాశ్వతానందం. అలా మోక్షాన్నందుకుంటే తిరిగి వచ్చే పనిలేదు. పరమాత్మ స్థానంలో శాశ్వతంగా ఉండిపోవటమే.

అట్టి పరమాత్మ స్థానాన్ని అందుకొనుటకు ప్రయత్నించి, దుర్లభమైన ఈ మానవ జన్మను సార్థకం చేసుకొందుము గాక!

---స్వస్తి---